# ఓ ధృతరాష్ట్రుని కథ

ఔత్సాహిక నాటక సమాజంవారు 'శ్రీకృష్ణ రాయబారం' నాటకాన్ని దిగ్విజయంగా ప్రదర్శించే సత్సంకల్పంతో జోరుగా, హుషారుగా ప్రయత్నాలు ప్రారంభించారు.

మరునాడు సాయంత్రమే శారదా కళామందిరంలో ప్రదర్శన. ఆ ఊరి ప్రేక్షకులు మహా కుశాగ్రబుద్ధులు, సూక్ష్మగ్రాహులు. నాటకప్రదర్శనలో కాని, పద్యపఠనంలో కాని ఏమాత్రం హెచ్చూ తగ్గూ వచ్చినా ఈలలతో హోరెత్తించి చప్పట్లతో దరువులు వేసి అరుపులూ, కేకలూ, బల్లలమీద పిడిగుద్దులతో కావలిసినంత ఆర్కెస్ట్రా సృష్టించి ఫ్లయింగ్ మిసెల్స్ లాగా చెప్పుల్ని స్టేజీమీదకు విసిరి నటులను యథాశక్తి సత్కరిస్తుంటారు. కొన్ని కొన్ని చోట్ల కుళ్ళిపోయిన కోడిగుడ్లనూ, టమోటాలను కూడా రంగస్థలం మీదికి రంజుగా విసురుతారని వారూ విన్నారు కాని ఆ విన్యాసాన్ని ఆచరణలో పెట్టలేదు ఇంకా. ఏదో సంసార పక్షంగా ప్రాచీన సాంప్రదాయం ప్రకారం పాత చెప్పులతోనే సరిపెట్టుకుంటున్నారు పాపం. ప్రేక్షకులలో ఇంతటి హేమాహేమీలూ, ఉద్దండులూ, జగజెట్టీలూ ఉన్నారు కనుకనే ఆ ఊరిలో నాటకాలు వేసేవారు ఒళ్ళు దగ్గర పెట్టుకుని ప్రవర్తిస్తుంటారు. ఒకవిధంగా ఆ ఊరిలో నాటకం వేయడాన్ని ఒక సవాలుగా, లిట్మస్ టెస్టుగా భావించుకుంటుంటారు. అక్కడ కనక విజయవంతంగా నాటక ప్రదర్శన జరిగిందంటే ఇంక ఢోకాలేదు. ఆంధ్రదేశమంతటా నల్లేరు మీద బండిలాగా తమ జైత్రయాత్రను నడపవచ్చు. అదీ ఆ ఊరి పరిస్థితి.

అంతా బాగానే ఉంది. తాగే తాగే పానకంలో పుడక అడ్డుపట్టట్లుఇష్టమైన మృష్టాన్నంలో మొదటి ముద్దలోనే మశకం పడ్డట్లు అనుకోని అవాంతరం వచ్చి పడింది ఆ సమాజం వారికి. మరునాడు నాటక ప్రదర్శన ఉందనగా ధృతరాష్ట్ర పాత్రధారి స్కూటర్ మీదనుంచి కిందపడి కాళ్ళూ చేతులూ విరక్కొట్టుకుని, నాటకంలో సింహాసనం మీద కళ్ళు మూసుకుని కూర్చునే బదులు హాస్పిటల్‌లో మంచంమీద కళ్ళు మూసుకుని పడుకున్నాడు. భారతంలో ధృతరాష్ట్రుడికి విలువలేక పోవచ్చు. కాని, ధృతరాష్ట్రుని పాత్ర లేనిదే రాయబారం సీను ఎలా నడుస్తుంది? దాంతో తలలు దిమ్మెక్కి, మతులుపోయి మరో ధృతరాష్ట్రుని వేటలో పడ్డారు సమాజం వారు. ఒకటో కృష్ణుడు, రెండో కృష్ణుడు .... ఐదో కృష్ణుడు వంటి ప్రయోగాల్ని ఆ సమాజంవారు కూడా చేశారు కాని, దిక్కుమాలిన ధృతరాష్ట్రుడు విషయంలో మరో ధృతరాష్ట్రుని అవసరం వచ్చిపడుతుందని వాళ్ళు కలలో కూడా ఊహించలేదు. అందులోనే కనీసం ఇరవై నాలుగు గంటల వ్యవధి కూడా లేకుండా ఈ చావొచ్చి పడడంతో దిక్కుతోచక దిక్కులు చూడసాగారు వాళ్ళు ధృతరాష్ట్రుడి కోసం - ఆసమయంలో వాళ్ళ కంటబడ్డాడు సుబ్బారావు.

సుబ్బారావు వాళ్ళ ఆఫీసులోనే ఒక గుమాస్తా. అప్పుడప్పుడు వాళ్ళ నాటకాలను చూడడానికి వస్తుండేవాడు. ఏమీ తోచనప్పుడు అప్పుడప్పుడు సరదాగా వాళ్ళ రిహార్సల్ చూడడానికి వస్తుండేవాడు.

అప్పటివరకూ ఆ సమాజం వాళ్ళెవరూ సుబ్బారావు అనే శాల్తీని ఎప్పుడూ ప్రత్యేకంగా గుర్తించలేదు.

ఆ సమయంలో వాళ్ళకి అతను ఆపద్బాంధవుడిలాగా కనిపించాడు. మామూలుగా అయితే ప్రేతకళ మొహం అనుకునే అతని ముఖంలో ధృతరాష్ట్ర కళ గోచరించింది.

"బాబూ సుబ్బారావూ! నువ్వే మాకు దిక్కు. ఇవి చేతులు కావు .... కాళ్ళు" అంటూ డైరెక్టర్ సుందరం అమాంతం సుబ్బారావు రెండుచేతులూ పట్టుకున్నాడు. అతని వెనక మరో నలుగురూ ఆశగా అతనివంకే చూస్తున్నారు.

అనుకోని ఈ సంఘటనకు బిత్తరపోయాడు సుబ్బారావు. తన కాళ్ళు పైకెప్పుడు వచ్చాయా అని కంగారు పడ్డాడు. అనుమానంగా చేతుల వంక చూసుకున్నాడు. చేతులు చేతుల స్థానంలో, కాళ్ళు కాళ్ళ స్థానంలోనూ ఉండడంతో, 'వీడేమిటి! వసుదేవుడిలాగా కాళ్ళు పట్టుకుంటా నంటాడు' అనుకుని, ఛ. అలా అయితే నేను గాడిదను అయిపోనూ' అని మనసును మందలించుకుని అమాయకంగా వాళ్ళవంక చూశాడు. వాళ్లందరూ తననే చూస్తుండటంతో 'కొంపతీసి వీళ్ళు నన్ను హైజాక్ చేయడానికి రాలేదు కదా!' అని బెంబేలు పడ్డాడు. నూతిలోంచి మాట వస్తున్నట్లుగా హీనస్వరంతో "ఏమిటిది! ఏం కావాలి?" అన్నాడు భయంగా.

"మే మిలా పెద్ద ఆపదలో చిక్కడ్డాం. నువ్వే కాపాడాలి. కాదనడానికి వీలులేదు" అంటూ సుబ్బారావు చేతులు గట్టిగా నొక్కాడు సుందరం.

"అబ్బ" అంటూ విదిలించుకుని, "అసలు ఏం జరిగింది?" అన్నాడు సుబ్బారావు అనుకోని ప్రళయానికి బెదిరిపోతూ.

"అలా అన్నావు బాగుంది. ధృతరాష్ట్రుడు హాస్పిటల్లో చేరాడు" అన్నాడు సుందరం తలా తోకా లేకుండా.

"ధృతరాష్ట్రుడా? వాడెవడు?" అన్నాడు సుబ్బారావు కొంచెం తెప్పరిల్లి.

"చచ్చాం పో. మానాటకంలో ధృతరాష్ట్రుడి వేషం వేస్తున్నాడే సత్యమూర్తి .... వాడికి స్కూటర్ యాక్సిడెంట్ అయింది. ఆస్పత్రిలో పడేవారు" అంటూ కొంచెం తోక అందించాడు సుందరం. ఆ సమయంలో యాక్సిడెంట్ కల్పించుకొన్నందుకు సత్యమూర్తి మీద కసితో.

"అయ్యో పాపం, ఎంతపని అయింది. ఇప్పుడెలా పాపం? అసలు యాక్సిడెంట్ ఎలా జరిగింది? మీరెళ్ళి చూశారా?" అంటూ ఛాందసంగా ప్రశ్నల వర్షం కురిపించడం మొదలు పెట్టాడు సుబ్బారావు.

"నీ బొంద, నీ సానుభూతిని అక్కడితో ఆపు. కావాలనుకుంటే, ఓపిక ఉంటే ఎల్లుండి ఆస్పత్రికి వెళ్ళి తీరిగ్గా పరామర్శించిరా. ముందు నేను చెప్పేది విను" అంటూ అసహనంగా కసురుకున్నాడు సుందరం.

"ఎల్లుండి వరకు ఆస్పత్రిలోనే ఉంటాడా, అన్ని దెబ్బలు తగిలాయా" అంటూ మరో ప్రశ్న వేశాడు అమాయక చక్రవర్తి సుబ్బారావు.

"చూడు, సుబ్బారావ్! నేను సీరియస్‌గా మాట్లాడుతున్నాను. నేను చెప్పేది సాంతం వినకుండా అడ్డు తగిలావంటే నీ తల పగలకొట్టి ఆస్పత్రిలో సత్యమూర్తి బెడ్ ప్రక్కనే నీబెడ్ కూడా వేయిస్తాను" అంటూ కరకరలాడాడు సుందరం.

సంగతేమిటో అర్థంకాక బిత్తర చూపులు చూడసాగాడు సుబ్బారావు.

"చూడు, సుబ్బారావ్! ఎక్కువగా మాట్లాడే టైమ్ లేదు. నువ్వు మేం అనేది కాదనడానికి వీలులేదు. రేపటి నాటకంలో నువ్వు ధృతరాష్ట్రుడి వేషం వేయాలి" అన్నాడు సుందరం, సుబ్బారావు

చేతులు మరోసారి పట్టుకుంటూ.

"అవును, సుబ్బారావ్, నువ్వీ వేషం వేసితీరాలి. మా మాట కాదనకుండా మమ్మల్ని గట్టెక్కించాలి" అన్నారు అందరూ ముక్తకంఠంతో.

సుబ్బారావుకి షాక్ కొట్టినంత పనయింది. కెవ్వున కేక వేయలేదు కాని, ముఖ భంగిమలు మాత్రం అలాగే పెట్టాడు. "ఏమిటీ జోక్! నేను నాటకం వేయడ మేమిటి? ఇవాళ ఏప్రిల్ ఫస్టు కూడా కాదు" అన్నాడు సుబ్బారావు.

"ఏం.... నాటకం వేయాలంటే రెండు కొమ్ములేం ఉండక్కరలేదు. ఎవరైనా వేయవచ్చు" అంటూ ధైర్యం చెప్పాడు సుందరం.

"ఇంకా నయం. స్టేజి అంటేనే చచ్చే భయం నాకు. మన క్లబ్ ఫంక్షన్‌లో ఒకసారి ఎవరికో దండ వేయడానికి వెళ్ళినప్పుడు కూడా నా కాళ్ళు వణికాయి. నన్నొదిలిపెట్టి ఇంకెవరినైనా చూసుకోండి' ' అంటూ వెళ్ళిపోవడానికి ఒక అడుగు ముందుకి వేశాడు సుబ్బారావు.

వెళ్తున్న సుబ్బారావు భుజం పట్టుకొని బలంగా వెనక్కి లాగాడు సుందరం. "చూడు నాయనా! నువ్వు వేసేది ధృతరాష్ట్రుడి వేషం. నిలబడితే కదా నీ కాళ్ళు వణికేది. ధృతరాష్ట్రుడు హాయిగా సింహాసనం మీద కూర్చుంటాడు. నీ కో చక్కని నగిషీ కుర్చీ వేస్తాం. గూట్లో గ్రుడ్లను పొదుగుతున్న గువ్వలాగా, ఆ కుర్చీలో కుదురుగా ముడుచుకు కూర్చో" అంటూ వెన్ను నిమిరాడు సుందరం.

"లాభం లేదు. నిలబడను కాబట్టి కాళ్ళు వణక్కపోవచ్చు. కాని జనాన్ని చూస్తుంటే నా వళ్ళంతా వణుకుతుంది" అంటూ మరో పాయింట్ లేవదీశాడు సుబ్బారావు.

"ఓయి వెర్రినాయనా! నీ పాత్ర సంగతే నువ్వు మరిచిపోతున్నావు కదా! నువ్వు వేసేది ధృతరాష్ట్రుని వేషం. ధృతరాష్ట్రుడు గ్రుడ్డివాడు. కళ్ళు మూసుకుని కూర్చుంటాడు. నువ్వు చేయవలసింది కూడా ఆ పనే. హాయిగా కబోది పక్షల్లే కళ్ళు మూసుకుని కుర్చీలో ఒదిగి కూర్చో. ప్రేక్షకులు నీ కంటికి కనిపించనప్పుడు ఇంక భయ మేముంది?" అంటూ మరో సూక్ష్మం వివరించాడు సుందరం, శ్రీకృష్ణుడు అర్జునునికి గీతోపదేశం చేస్తున్నట్లు.

"బాగానే ఉందనుకో .... కాని, నాకు పోర్షనేం వచ్చు? ఒక్కరోజులో డైలాగ్స్ ఏం నేర్చుకుంటాను?" అంటూ నసగసాగాడు సుబ్బారావు.

"చూడు, బాబూ, అనవసరంగా నువ్వు దిగులుపడి మమ్మల్ని ఇబ్బంది పెట్టకు. ధృతరాష్ట్రుడు రాయబారం సీనులో చివరి వరకూ స్టేజీ మీదనే ఉంటాడు కానీ ఉలకడు, పలకడు. కళ్ళు మూసుకొని సింహాసనం మీద కూర్చుని ఉంటాడు. అంతే. ఆ పాత్రకున్న డైలాగ్‌లు మూడు, నాలుగు మించి లేవు. అవైనా చిన్నవి. వాటిని బట్టీ పట్టడానికి నీకు పది నిమిషాలు కూడా పట్టదు. అనవసరంగా బెట్టు చేయక సరే నను" అన్నాడు సుందరం కొంచెం ప్రాధేయ పూర్వకంగా.

"డైలాగ్స్ ఎంత లేకపోతే మాత్రం ధృతరాష్ట్రుడు ఊరికే ఎలా ఉంటాడు? ఏవో కొన్ని ఎక్స్‌ప్రెషన్స్ అయినా ఉండాలి కదా!" అన్నాడు సుబ్బారావు.

" నీ సందేహాలకు నిప్పంటించా, ధృతరాష్ట్రుడు గుడ్డిముండాకొడుకు. వాడికి ఎక్స్‌ప్రెషనేమిటి నా పిండాకూడు" అంటూ చిరాకు పడ్డాడు సుందరం.

"మరి" అంటూ నసిగాడు సుబ్బారావు.

"మరీలేదు, గిరీలేదు. మారు మాటాడకు. ఎక్కువ మాట్లాడావంటే మూతిమీద కొడతా. ఎక్స్‌ప్రెషన్ కోసం నువ్వేమీ అవస్థపడనక్కరలేదు. తలని అడ్డంగానో, నిలువుగానో నీకు తోచినట్లు

ఆడిస్తుండు. లేకపోతే అడ్డంగానూ, నిలువుగానూ కూడా ఆడిస్తుండు. ఆ ఆడింపుకు భావాలు ఎవరికి తోచినట్లు వాళ్ళు చెప్పుకుంటారు. అటు కృష్ణుడికీ చెప్పలేక, ఇటు కొడుకులను ఒప్పించలేక చిత్తక్షోభలో కుమిలిపోతూ తల ఆడించేస్తున్నాడు ధృతరాష్ట్రుడు అనుకుంటారు. అయినా, నీ పిచ్చికాని పద్యాలు ఎవరు ఎలా పాడుతున్నారు, ఎంత పెద్ద రాగాలు తీస్తున్నారూ అని చూస్తారే కాని మన ప్రేక్షకులు, ఆ ధృతరాష్ట్రుడు ఏం చేస్తున్నాడో చూసే వాడెవడయ్యా? ఇంక .. అట్టే మాట్లాడకు. నాకు చిర్రెత్తుకొస్తుంది" అన్నాడు సుందరం.

"సరే. మీరు అంతగా చెబుతుంటే నేను కాదని ఎలా అనగలను. పైగా మీరు కష్టాల్లో ఉన్నప్పుడు నేను సాయం చేయకపోతే ఎలా" అభయముద్ర వేశాడు సుబ్బారావు.

"అలా అన్నావు బాగుంది. ఇప్పుడు నువ్వు నిజంగా సుబ్బారావువి. లేకుంటే వట్టి సుబ్బిగాడివి. ఇత్తడి సుబ్బిగాడివి. పాడుం డబ్బిగాడివి" అంటూ ఉత్సాహంతో కవిత్వ ప్రకోపనం మొదలుపెట్టాడు సుందరం.

"ఆపాపు నీ సైత్యం. ఆ..... చివరగా ఒక చిన్న ప్రశ్న" అన్నాడు సుబ్బారావు.

"నీకేమన్నా టి.విలో ఇంటర్వ్యూ చేసేవాళ్ళ గాలిసోకింది ఏమిటి! చివరగా ఒక చిన్నప్రశ్న అంటున్నావు? ఏమిటది?" అన్నాడు సుందరం.

"ఏంలేదు. ఈ బలిపీఠం ఎక్కడానికి మీకు నేను తప్ప ఇంకెవరూ దొరకలేదా ఇందరు మహానటులు ఈ మహా పట్టణంలో ఉండగా?" అన్నాడు సుబ్బారావు.

"చూడు బాబూ! సత్యమూర్తి మంచం ఎక్కడంతో మా మతులు పోయి ఇలా వీధినపడ్డాం ధృతరాష్ట్రుడిని వెతుక్కుంటూ. మా అదృష్టం అను, నీ ఖర్మ అనుకో. సమయానికి నువ్వు మాకు తటస్థపడ్డావు. దానికితోడు నీ మొహంలో ధృతరాష్ట్ర కళ ధగధగా వెలిగిపోతూంది. దాంతో పూలహారం నీ మెడలోనే వేసేశాం. ఎవరో ఒకరికి వేయక తప్పదు కదా .... అది నువ్వే కావడం మా అదృష్టం. ఇంక నీ కుశ్శంకలూ, లఘుశంకలూ మానేసి తిన్నగా కొంపకి పోయి భోజనం చేసి సరిగ్గా నాలుగ్గంటలకల్లా సమాజం ఆఫీసుకు రా. రెండు రిహార్సల్సు పడ్డాయంటే ఇట్టే అడ్జస్ట్ అయిపోతావు' ' అన్నాడు సుందరం.

"సరే తప్పుతుందా, వస్తాను" అంటూ అడుగు ముందుకి వేశాడు సుబ్బారావు.

"తప్పుతుందా అంటూనే తప్పించుకోవడానికి చూస్తావేమో! సరిగ్గా నాలుగ్గంటలకి రిహార్సల్‌కి రాకపోయావో, నిన్ను నిజంగా ధృతరాష్ట్రుడిని చేసి మరీ కూర్చోబెడతాం జాగ్రత్త!" అని హెచ్చరించాడు సుందరం.

"మాటంటే మాటే. ఇంత లోతు దిగాక ఇంకా చలేమిటి? ఈ దెబ్బతో నేను నటుణ్ణేనా కావాలి, లేదా నాటకం ....." అంటూ ఉత్సాహంగా ఏదో అనబోయాడు సుబ్బారావు.

"ఊ, ఇంక ఆపు నీ అపశకునం మాటలు. నాటకం చెడిందో జాగ్రత్త. నువ్వు నిజంగా ధృతరాష్ట్రుడ వవుతావు" అంటూ టాపిక్ కట్ చేసి ముందుకు వెళ్ళిపోయాడు సుందరం తన బృందంతో.

ముందు ఇష్టపడకపోయినా, మనసులో భయంవేసినా, ఆ తరువాత తాను కూడా నటుడిగా రంగప్రవేశం చేయబోతున్నందుకు ఆనందం కలిగింది సుబ్బారావుకు. తియ్యటి ఊహల్లో విహరిస్తూ ఇంటికి చేరాడు.

శారదాకళామందిరం ప్రేక్షకులతో కిటకిట లాడుతోంది. 'శ్రీకృష్ణ రాయబారం' పేరున్న పౌరాణిక నాటకమేమో ఇరుగు పొరుగు పల్లెటూళ్ళనుంచి కూడా జనం బాగానే వచ్చారు. దానికితోడు

ఆ నాటక సమాజం కూడా అంతకు ముందు అదే నాటకాన్ని విజయవంతంగా ప్రదర్శించింది.

నాటకం మొదలయింది. కృష్ణుడూ, దుర్యోధనుడూ మొదలైనవారు పద్యాలను పేల్చేస్తూ, హాలును దద్దరిల్ల జేస్తున్నారు. ఉత్సాహంతో ప్రేక్షకులు చప్పట్లు చరుస్తూ "ఒన్స్‌మోర్"లు వదులుతున్నారు. అడిగిందే తడవుగా "మోర్" అనే మాట వినబడగానే పద్యాలను మారువడ్డన వడ్డిస్తున్నారు వేషధారులు. ధృతరాష్ట్రుని వేషంలో సుబ్బారావు బుద్ధిగా, ఒబ్బిడిగా కూర్చుని కళ్ళు మూసుకుని తోచినట్లు తల ఆడిస్తున్నాడు. మొదట్లో స్టేజీమీద కూర్చున్నప్పుడు కొంచెం భయం అనిపించినా అంతలో ఆ భయం ఎగిరిపోయింది. ఏదో ఊహాలోకాల్లో విహరిస్తూ కళ్ళు మూసుకుని ఉండిపోయాడు.

నాటకం అంతా సవ్యంగా సాగిపోతోంది. అనుకోని సమస్య ఎదురైనప్పటికీ, అనుకున్న దానికంటే విజయవంతంగా నాటకం సాగుతూండడంతో అమితానందంగా ఉంది సుందరానికీ, అతని బృందం వారికీ!

నాటకం చివరి దశకి జేరుకుంటోంది. రాయబారం విఫలమయ్యే దృశ్యం అది. ఐదు ఊళ్ళు కాదు కదా సూదిమొన నిలిచేటంతటి భూమిని కూడా ఇవ్వను పొమ్మంటాడు దుర్యోధనుడు. అది విని కుమారుని మందలించమని హితవు చెబుతాడు శ్రీకృష్ణుడు ధృతరాష్ట్రునికి.

అప్పటివరకూ అంతా బాగానే ఉంది. అయితే, ఆ కిందటి రాత్రి సరిగా నిద్ర లేదో ఏమో, దానికి తోడు కళ్ళు మూసుకుని కూర్చునేసరికి అందులోనూ మెత్తని బాలీసులున్న సింహాసనం మీద ధృతరాష్ట్రుని వేషంలో ఉన్న సుబ్బారావుకి నిద్ర ముంచుకొచ్చింది. ఆడిస్తూండిన తల ఆగిపోయి ఒక పక్కకి వాలిపోయింది. అంతలో నెమ్మదిగా గురకకూడా మొదలయింది. మొదట్లో పద్యాలను దంచే ఉషారులో ఉన్న శ్రీకృష్ణుడు కానీ, దుర్యోధనుడు కానీ ఈ విషయాన్ని గమనించలేదు. ఉత్సవ విగ్రహాలలా కూర్చున్న మిగిలిన పాత్రలేవీ దీనిని పట్టించుకోలేదు.

శ్రీకృష్ణుడు "ధృతరాష్ట్ర మహారాజా! వింటివా నీ కొమరుని ధూర్త వాక్యములు? కంటివా, నీ ముద్దులపట్టి దురుసుతనము? నీవు జన్మాంధుడవే కాని, జ్ఞానాంధుడి కావు. ఇప్పటికైనా మేల్కొనుము - నీ పుత్రునికి హితవు చెప్పుము" అని ధృతరాష్ట్రుని వైపు తిరిగి అన్నాడు.

అందుకు బదులుగా గురక స్థాయిని పెంచాడు సుబ్బారావు. అదృష్టశాత్తూ మైకు ఆ దగ్గరలో లేకపోవడంతో, ఆ గురుకనాదం ప్రేక్షకుల చెవుల దాకా వెళ్ళలేదు. అయితే రానున్న ప్రమాదాన్ని పసిగట్టాడు శ్రీకృష్ణుని వేషంలో ఉన్న సుందరం. 'కొంప ముంచావు కదరా సుబ్బిగా' అనుకుంటూ, ధృతరాష్ట్రునికి మరింత దగ్గరికి వెళ్ళి - "ఏమి, ధృతరాష్ట్రా! నా మాటలు చెవికి ఎక్కుటలేదా! మహారాజు వయ్యుండి నీ కుమారునికి ఇంతమాత్రం బుద్ధి గరపలేవా?" అంటూ సొంత డైలాగును సృష్టించి వదిలాడు.

అయినా ధృతరాష్ట్రుడి చెవులకు ఆ మాటలు సోకనేలేదు. గురకస్థాయి ఇంకా పెరగడమే కాక మధ్యలో ఈలలు కూడా రాసాగాయి.

ఇంక లాభం లేదనుకొని "ధృతరాష్ట్రా! ఏమి ఈ నిర్లిప్తత?" అంటూ సుబ్బారావు భుజం పట్టుకొని బలంగా ఊపాడు సుందరం.

ఆ ఊపుతో కంగారుపడ్తూ లేచి నిలబడబోయి ఢామ్మని ముందుకి పడ్డాడు సుబ్బారావు. హాలు ప్రేక్షకుల ఈలలతో, చప్పట్లతో దద్దరిల్లిపోయింది.

మరు నిమిషంలో స్టేజీమీద చెప్పుల వర్షం కురిసేదే కాని, అత్యంత సమయస్ఫూర్తిని

ప్రదర్శించాడు సుందరం. శ్రీకృష్ణుని వేషంలో నున్న అతను కౌరవ సభలోని పెద్దల వంక తిరిగి "కురు వృద్ధులారా, గురు వృద్ధులారా! భీష్మ, ద్రోణ, కృపాచార్యాది పెద్దలారా! చూచితిరా ... ధృతరాష్ట్ర మహారాజు దైన్యస్థితి. అటు రాయబారము తెచ్చిన మాటలనూ కాదనలేడు. తన మాట వినని కొడుకుని ఒప్పించనూ లేడు. ఈ పరిస్థితిలో మానసికాందోళనను తట్టుకోలేక ఏవిధముగా కుప్పకూలినాడో గమనించితిరి గదా?!" అని ధృతరాష్ట్రుని దగ్గరకు వెళ్ళి "ధృతరాష్ట్ర మహారాజా .... మనసును చిక్కబరచుకొమ్ము. ఇదే నీకు బలము నొసంగుచున్నాడను" అంటూ చేయిబట్టి లేవదీసి సింహాసనం మీద మళ్ళీ కూర్చోబెట్టాడు.

క్రింద పడడంతో మెలకువ వచ్చింది సుబ్బారావుకు ..... పరిస్థితిని అర్థం చేసుకుని కిమ్మనకుండా సింహాసం ఎక్కి కూర్చున్నాడు. ఆ తర్వాత - "శ్రీకృష్ణా! నేను నిమిత్తమాత్రుడను. భూత వర్తమాన భవిష్యత్తులు ఎరిగిన నీకు ఈ రాయబారము యొక్క పర్యవసాన మెటుల యుండునో తెలియనిదా? నీ చిత్తము వచ్చినట్లే కావింపుము" అంటూ తిరిగి తలాడిస్తూ కూర్చున్నాడు సుబ్బారావు.

నాటకంలో కొత్తగా చోటుచేసుకున్న ఈ దృశ్యం దర్శకుడు గుడ్ ఎఫెక్ట్ కోసం కొత్తగా ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టినదని భావించారు ప్రేక్షకులు. ఆ దృశ్యం అత్యంత సహజంగా ఉండి వారికి నచ్చడంతో, చప్పట్లతో తమ ఆనందామోదాలను తెలియ జేశారు.

అటు తర్వాత మిగిలిపోయిన నాటక భాగాన్ని అందుకుని విజయవంతంగా నాటకాన్ని పూర్తి చేశాడు సుందరం.

అప్పటినుంచీ ఆ దృశ్యం ఆ సమాజం వారు ప్రదర్శించే 'శ్రీకృష్ణ రాయబారం' నాటకంలో చోటు చేసుకుంది. అంతేకాదు; ధృతరాష్ట్రుడు ఆవేదనను తట్టుకోలేక క్రిందపడిన దృశ్యాన్ని అత్యంత సహజంగా చూపించిన సుబ్బారావు ఆ దెబ్బతో నటుడయిపోయాడు - ధృతరాష్ట్రుడిగా.

*(ఆంధ్రప్రభ వారపత్రిక 15-8-1984)*